రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని మృతి

ఈశ్వరి (ఫైల్)

బోధన్ రూరల్, జూలై 18: మక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోధన్ మండలం చిన్నమావంది గ్రామానికి చెందిన ఈశ్వరి (12) అనే విద్యార్థిని గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. దాస్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులను కలిసేందుకు ఆదివారం వారి తల్లిదండ్రులు వెళ్లగా కారు ఢీకొని ఈశ్వరి తల్లితోపాటు మరో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. అదే పాఠశాలలో చదువుతున్న చిన్నమావందికి చెందిన బాలిక ఈశ్వరిని చూసేందుకు ఆమె తల్లి శ్రీరామ్ పద్మ ఆదివారం వెళ్లింది. తన పిల్లలతో కలిసి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. బాలిక తల్లి అక్కడికక్కడే మృతి చెందగా ఈశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ బాలిక గురువారం మృతి చెందింది. వారంలో వ్యవధిలో తల్లి, కూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

పది గంటల్లోనే పట్టేశారు..

వినాయక్‌నగర్‌లో యువకుడి హత్యకేసులో నిందితుడి అరెస్టు

వినాయక్‌నగర్, జూలై 18: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో బిహార్‌కు చెందిన ఆనంద్ బీహారి పాండే అనే యువకుడు హత్యకు గురికాగా..ఈ కేసును పోలీసులు పది గంటల్లో ఛేదించారు.నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నగర సీఐ నరహరి ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం హత్యకేసులో నిందితుడిని గుర్తించారు. యువకుడి హత్యకు ఓ వైన్స్ షాపు పర్మిట్ రూమ్‌లో ఇద్దరి మధ్య జరిగిన గొడవే కారణమని పోలీసుల విచారణలో తేలింది.ఆనంద్ స్థానిక వినాయక్‌నగర్‌లోని ఓ పర్మిట్ రూమ్‌లో మద్యం తాగిన అనంతరం వెనుక ఉన్న ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తుండగా..అదే పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తున్న మరో వ్యక్తితో గొడవ జరిగింది. దీంతో వారి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ గొడవను మనసులో పెట్టుకున్న ప్రత్యర్థి బయటికి వచ్చిన అనంతరం ఆనంద్‌ను కిందికి నెట్టేసి బండరాయితో తలపై దాడి చేశారు. దీంతో సదరు యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఈనెల 16న రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో బోధన్ శివారులోని పలు వాగులు నీటితో ప్రవహిస్తున్నాయి. నర్సాపూర్ వాగు, పంజాబ్ వాగుల్లో నీరు ఉధృతంగా పారుతోంది. బోధన్ బైపాస్ రహదారి పక్కనే ఉన్న పాండు చెరువు అలుగుకు సమాంతరంగా నీరు చేరుకుంది. పూర్తిస్థాయిలో నీటితో నిండింది. బోధన్ పట్టణంలోని రోడ్లపైకి మురికి కాల్వల నీరు పారి దుర్గంధం వ్యాపించింది. బోధన్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నీటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

–శక్కర్‌నగర్, జూలై 18

రుణమాఫీ డబ్బులు రైతు చేతికి అందాలి

బ్యాంకర్లకు నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్ల సూచన

మాట్లాడుతున్న రాజీవ్‌గాంధీ హన్మంతు

కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కంఠేశ్వర్, జూలై 18 : రుణమాఫీ పథకం డబ్బులు సంబంధిత రైతుల చేతికి అందేలా బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నిజామాబాద్‌లోని కలెక్టరేట్‌లో రుణమాఫీపై గురువారం బ్యాంకు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రుణ మాఫీ పథకం ద్వారా మొదట లక్ష రూపాయల లోపు పంట రుణాలు ఉన్న రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం నిధులు జమచేయనున్నదని, దీని ద్వారా జిల్లాలో 44,469 మంది రైతులకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలిపారు. మరో పక్షం రోజుల్లో లక్షన్నర, రెండు లక్షల రూపాయల రుణాలు కలిగిన రైతులకు కూడా రుణమాఫీ నిధులను అందజేయనున్నదని చెప్పారు. రుణమాఫీ కింద ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులను నేరుగా రైతులు విత్ డ్రా చేసుకునేలా చూడాలన్నారు.ఎట్టి పరిస్థితిలోనూ రుణమాఫీ నిధులను పాత బకాయిలు, ఇతర రుణాల కోసం మినహాయించుకోరాదని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ సంకేత్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, లీడ్‌బ్యాంకు మేనేజర్ అశోక్ చవాన్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా రుణమాఫీ పూర్తిచేయాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జూలై 18 : అర్హులైన రైతులందరికీ పకడ్బందీగా రుణమాఫీ పూర్తి చేయాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతు రుణమాఫీ షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో బ్యాం కర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతు రుణమాఫీపై ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడుతగా జిల్లాలో 49,541 మంది రైతులకు 235 కోట్ల 61 లక్షల రూపాయల రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. అర్హత ఉన్న వారికి రుణమాఫీ జరగకుంటే జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 99666 49838 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని రైతులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి, రవికాంత్, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

వినాయక్‌నగర్, జూలై 18: వృద్ధురాలి హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆర్మూర్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన వెంకటి 2008 సంవత్సరంలో రేప్ అండ్ మర్డర్ కేసులో జీవిత కారాగార శిక్ష అనుభవిస్తుండగా సత్ప్రవర్తన కింద ఆయనను విడుదల చేశారు. అదే గ్రామానికి చెందిన కొత్తూరు గంగు(65) అనే మహిళ తన ఇంట్లోని సొదకబాధకాలు వెంకటితో చెప్పుకునేది. ఈ క్రమంలో వృద్ధురాలిపై ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసిన వెంకటి.. తన స్నేహితుడు కడమంచి సురేశ్‌తో కలిసి వృద్ధురాలిని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ గ్రామమైన మగ్గిడి శివారు ప్రాంతానికి తీసుకెళ్లి చీర కొంగు మెడకు చుట్టి హత్యచేశాడు. ఈ మేరకు ఆర్మూర్ పోలీసులు కేసు నమోదు చేసుకోగా..సీఐ సురేశ్‌బాబు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. 12 మంది సాక్షులను విచారించిన కోర్టు నేరాభియోగాలు రుజువైనట్లు నిర్ధారించింది. వెంకటికి ఏడేండ్ల జైలు శిక్ష, దోపిడీ నేరం ప్రకారం పదేండ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ సెషన్స్ జడ్జి సునీత గురువారం తీర్పు చెప్పారు. రెండో ముద్దాయిపై నేర అభియోగాలు రుజువు కానందున నిర్దోషిగా విడుదల చేశారు.

నాగన్న బావిని సందర్శించిన కేంద్ర నోడల్ అధికారి

లింగంపేట, జూలై 18: లింగంపేటలోని చారిత్రత్మక కట్టడమైన నాగన్న బావిని మినిస్ట్రీ ఆఫ్ పవర్ డిపార్ట్‌మెంట్, కేంద్ర నోడల్ అధికారి బెంజ్‌మెన్ కరుణాకరణ్ గురువారం సందర్శించారు. స్థానిక అధికారులు ఆయనకు బావి విశిష్టతను వివరించారు. నానగ్న బావి అభివృద్ధికి గతంలో పని చేసిన కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కృషి చేసినట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థ సహకారంతో బావిని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిధులతో రహదారి నిర్మాణం, విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టి పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు అధికారులు అయన దృష్టికి తీసుకెళ్లారు. బావి వద్ద ఆయన మొక్కను నాటారు. ఆయనతోపాటు కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ శాస్త్రవేత్త ఏఎస్ పవార్, ఎంపీడీవో నరేశ్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల కన్వీనర్ బొల్లు శ్రీకాంత్, సీసీ మెహర్, గుండ బాలకిషన్ తదితరులు ఉన్నారు.

నాగన్న బావిని పరిశీలిస్తున్న కేంద్ర నోడల్ అధికారి, జిల్లా అధికారులు

టీయూ పరిధిలో డిగ్రీ ఫలితాలు విడుదల

ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్, అధికారులు

డిచ్‌పల్లి, జూలై 18 : టీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షా (2021–24) ఫలితాలను విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ ఎం.యాదగిరి గురువారం తన చాంబర్‌లో పరీక్షల నియంత్రణ అధికారిణి అరుణతో కలిసి విడుదల చేశారు. మొత్తం 8,930 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3966 మంది (44.41 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 27.93 శాతం కాగా బాలికలు 55.66 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ సాయిలు, డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయి, పీఆర్వో డాక్టర్ పున్నయ్య, ప్రోగ్రామర్లు సతీశ్, విజయ్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లోని ఆక్రమణల తొలగింపు

బోధన్ బస్టాండ్‌లో అక్రమంగా స్థలం కబ్జాచేసి వేసిన షెడ్లను తొలగింపజేస్తున్న అధికారులు

శక్కర్‌నగర్, జూలై 18: బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో అక్రమంగా వేసిన షెడ్లను బోధన్ ఆర్టీసీ అధికారులు పోలీసులు సహకారంతో గురువారం తొలగించారు. సుమారు 25 ఏండ్ల క్రితం కొందరు ఈ షెడ్లను వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. షెడ్లను తొలగించాలని పలుమార్లు డీఎం శ్రీనివాస్ యజమానులకు నోటీసులు అందజేశారు. షెడ్ల యజమానులు స్పందించకపోవడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీటిని తొలగించే విషయంలో కోర్టుద్వారా ఆర్టీసీ అధికారులు ఉత్తర్వులు పొందారు. స్థానిక పోలీసుల పర్యవేక్షణలో జేసీబీతో తొలగించారు. ఈ షెడ్లు వేసిన వ్యక్తి ఆర్టీసీలో పనిచేసే ఓ ఉద్యోగి కావడం గమనార్హం. షెడ్ల తొలగింపును ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, బోధన్ సీఐ సంద్ర వీరయ్య పర్యవేక్షించారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూలై18: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గురువారం ఉదయం 6539 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా మధ్యాహ్నం వరకు 12500, రాత్రి 25,694 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు)కాగా, గురువారం వరకు 1064.20 అడుగులు (15.049 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి అవుట్‌ఫ్లో 447 క్యూసెక్కులు కొనసాగుతోంది.

గురువారం బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

డిసెంబర్‌కల్లా మలబార్ ప్లాంట్ రెడీ

- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ప్రముఖ బంగారం, వజ్రాభరణాల తయారీ సంస్థ మలబార్ జ్యూయెల్లరీ తెలంగాణ ప్లాంట్.. ఈ ఏడాది చివరికల్లా ఉత్పత్తిలోకి రానున్నది. రూ.750 కోట్ల పెట్టుబడితో మహేశ్వరంలో ఈ నగల తయారీ కేంద్రాన్ని మలబార్ ఏర్పాటు చేస్తున్నది. గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మహేశ్వరంలో ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన భూమిని అప్పుడే కేటాయించారు. మొదటి దశలో ఇప్పటికే కంపెనీ రూ.183 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఈ క్రమంలోనే గురువారం మలబార్ వర్గాలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సచివాలయంలో సమావేశమయ్యారు. ప్లాంట్ నిర్మాణం తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మలబార్ సంస్థ మహేశ్వరంలో తెస్తున్న యూనిట్ దేశంలోనే అతిపెద్దదని చెప్పారు. డిసెంబర్‌కల్లా సిద్ధమవుతుందన్నారు. అలాగే కావాల్సిన మౌలిక సదుపాయాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏఐపై 20 ఏండ్ల రోడ్‌మ్యాప్..

ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై వచ్చే 20 ఏండ్లకు అవసరమైన ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మంత్రి శ్రీధర్ బాబు బ్రిటీష్ హై కమిషన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్(ఈ అండ్ వై) కంపెనీ ప్రతినిధులకు సూచించారు. తెలంగాణా ప్రభుత్వం 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీలో బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై సంస్థలు కీలక భాగస్వాములు కావాలని ఆయన కోరారు. మరోవైపు సెబీ రూపొందించిన సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విధానం ద్వారా సంక్షేమ పథకాలకు అవసరమైన నిధులను సేకరించనున్నట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. నిధుల సమీకరణకు ప్రణాళికపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఐటీ ఉద్యోగులకు నిరాశే

జీతాల పెరుగుదల అంతంతే • టాప్ కంపెనీల్లో వృద్ధి శాతం సింగిల్ డిజిటే

సగటున జీతాల పెంపు %	TCS*	Infosys*	HCL*	Wipro**	TechM*
FY24	7-9	9	NA	9.4	5.6
FY23	6-9	9.9	5.1	13.4	6
FY22	10.5	14.6	6.8	10.4	5.2
FY21	6.4	6	4	10	0.3

బెంగళూరు, జూలై 18: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గత ఆర్థిక సంవత్సరం (2023–24) నిరాశనే మిగిల్చింది. అంతకుముందు రెండు ఆర్థిక సంవత్సరాలు సిబ్బంది జీతాలను రెండంకెల స్థాయి వృద్ధిలో పెంచిన ప్రధాన ఐటీ రంగ సంస్థలు.. గత ఆర్థిక సంవత్సరం మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితం చేశాయి మరి. దేశంలోని టాప్–5 ఐటీ కంపెనీల్లో మూడింట్లో వ్యయ నియంత్రణ చర్యలు స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆర్థికపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయా సంస్థలకు ఖర్చుల కట్టడి తప్పట్లేదు. ఇందులో భాగంగానే ఉద్యోగులకు వార్షిక వేతనాల పెంపులో కోత పెడుతున్నాయి. దీంతో మెజారిటీ ఐటీ ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 5 శాతం నుంచి 9 శాతం మేరకే సాలరీల్లో ఇంక్రిమెంట్లు దక్కాయి.

దిగ్గజ సంస్థల్లో..

దేశీయ ఐటీ రంగ సంస్థల్లో రెండో అతిపెద్ద సంస్థ అయిన ఇన్ఫోసిస్‌లో గత ఆర్థిక సంవత్సరం ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతమే పెరిగాయి. ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్‌లోనైతే 7–9 శాతమే. విప్రో విషయానికొస్తే.. 2023–24లో 9.4 శాతంగా ఉంటే.. టెక్ మహీంద్రాలో 5.6 శాతమే. కాగా, కరోనా ప్రభావం ఉన్నప్పటికీ 2021–22లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలకు రెండంకెల స్థాయిలో పెంపు శాతాన్నిచ్చాయి. టెక్ మహీంద్రా 5.2 శాతం, హెచ్‌సీఎల్ 6.8 శాతంతోనే సరిపెట్టాయి.

ప్రతికూలతల వల్లే..

భారీ సంఖ్యలో ఉద్యోగులు, పెరుగుతున్న వ్యాపార ఖర్చులు.. భారతీయ ఐటీ రంగాన్ని దెబ్బతీస్తున్నట్టు రిక్రూట్‌మెంట్ కన్సల్టెన్సీ మిషెల్ పేజ్ ప్రతినిధి ప్రన్షు ఉపాధ్యాయ్ అన్నారు. సంస్థాగత ఆదాయం–లాభాలు తగ్గడంతో దానికి తగ్గట్టుగానే పొదుపు మంత్రం జపిస్తున్నాయన్నారు. ఇక ప్రవేశ స్థాయిలో ప్రతిభ, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల లభ్యత లేకపోవడం కూడా సమస్యగా మారిందని చెప్పారు. కాగా, సంక్లిష్టమైన సాంకేతిక నైపుణ్యాలను కలిగిన ఉద్యోగులకు 12 నుంచి 15 శాతం సగటున సాలరీలు పెరుగుతున్నట్టు రాండ్‌స్టడ్ డిజిటల్ ఇండియా ఎండీ మిలింద్ షా తెలిపారు. ఆయా సంస్థలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తుండటంతో ప్రతిభావంతులకు సహజంగానే పెద్దపీట దక్కుతున్నదని తెలియజేశారు. వారి అవసరాలు బాగా ఉండటంతోనే జీతాలు అంతలా పెరుగుతున్నాయని గుర్తుచేస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26) ఏఐ, ఎంఎల్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులకు గిరాకీ ఎక్కువగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.

మున్ముందూ తిప్పలే

దేశ, విదేశాల్లో నెలకొన్న ఆర్థిక మందగమనం ఛాయలు.. భారతీయ ఐటీ కంపెనీలకు మున్ముందు మరిన్ని ఇబ్బందులను సృష్టించగలవన్న అభిప్రాయాలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక సంక్షోభపు పరిస్థితులు.. దేశీయ ఐటీ కంపెనీల ఆదాయానికి ఇప్పటికే గండి కొడుతున్నాయని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే భారీగా ఉద్యోగ కోతలు, అంతంతమాత్రంగా జీతాల పెంపులని ఐటీ రంగ నిపుణులు ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నారు. అగ్ర దేశాల రక్షణాత్మక ధోరణులు, వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు కూడా ఆర్థిక వ్యవస్థల్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు మారకపోతే ఐటీయేగాక అన్ని రంగాల మనుగడకు ముప్పేనని హెచ్చరిస్తుండటం గమనార్హం.

వాణిజ్య

రూపాయే..

ముంబై, జూలై 18: దేశీయ కరెన్సీ రికార్డు స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్–రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 5 పైసలు కరిగిపోయి 83.63 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్‌కు అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 83.57 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడేలో 83.55 గరిష్ఠ స్థాయిని తాకింది. ఒక దశలో 83.66 చారిత్రక కనిష్ఠ స్థాయిని తాకిన విలువ చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే ఐదు పైసలు తరిగిపోయి 83.57 వద్ద స్థిరపడింది.

అరబిందో 750 కోట్ల బైబ్యాక్!

హైదరాబాద్, జూలై 18: ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మారూ.750 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నది. ఇందుకుగాను కంపెనీ బోర్డు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరుకు రూ.1,460 చొప్పున 51,36,986 షేర్లను బైబ్యాక్ చేయనుండటంతో 0.88 శాతం వాటా పెరగనున్నది. ప్రస్తుతం సంస్థలో ప్రమోటర్లకు 51.8 శాతం వాటా ఉండగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు 16.73 శాతం, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు 19.17 శాతం వాటా ఉన్నది.

81 వేల పైకి సెన్సెక్స్

మరో మైలురాయిని అధిగమించిన సూచీ

ముంబై, జూలై 18: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో మైలురాయిని అధిగమించాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సూచీలు గురువారం మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 81 వేల మైలురాయిని అధిగమించింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ చరిత్రలో ఈ రికార్డును అధిగమించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 626.91 పాయింట్లు అందుకొని 81,343.46 పాయింట్ల వద్ద స్థిరమైంది. బలహీనంగా ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో రివ్వున ఎగిశాయి. ఐటీ రంగ సంస్థలు అంచనాలకుమించి రాణిస్తుండటంతో మదుపరులు ఈ షేర్లను కొనుగోలు చేయడానికి ఎగబడటంతో ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ ఒక దశలో 220 పాయింట్లకు పైగా బలపడ్డ సూచీ చివర్లో 187.85 పాయింట్లు అందుకొని 24,800.85 వద్ద స్థిరపడింది.

- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 3.33 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇన్ఫోసిస్ 1.93 శాతంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కాటీ, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ, టెలికం, ఆటో, టెక్ రంగ షేర్లు లాభపడగా..క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్స్, యుటిలిటీ రంగ షేర్లు నష్టపోయాయి.
- గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,446 పాయింట్లు(1.79 శాతం), నిఫ్టీ 485 పాయింట్లు(1.98 శాతం) బలపడ్డాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గడం కూడా సూచీలు పుంజుకోవడానికి పరోక్షంగా కారణమయ్యాయి.

ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో సూచీలు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. జూన్ త్రైమాసికపు ఆర్థిక ఫలితాల్లో ఐటీ సంస్థలు అంచనాలకుమించి రాణించడం, మరోవైపు రూపాయి బలహీనపడినప్పటికీ పుంజుకోవడం విశేషం. సెప్టెంబర్ సమీక్షలోనే అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో ఎఫ్‌ఐఐలు దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి నిధులు కుమ్మరించారు.

- వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ హెడ్

500 కోట్లతో తోషిబా ప్లాంట్ విస్తరణ

న్యూఢిల్లీ, జూలై 18: జపాన్‌కు చెందిన ఎలక్ట్రిక్ పరికరాల తయారీ సంస్థ తోషిబా గ్రూపు..భారత్‌లోవున్న ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 10 బిలియన్ జపాన్ యెన్(రూ.500 కోట్లకు పైమాటే)తో తెలంగాణలోని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని రెండింతలు పెంచుకోనున్నట్లు కంపెనీ చైర్పర్సన్, ఎండీ హిరోషి పురుటా ఈ సందర్భంగా తెలిపారు. 2023–24 నుంచి 2025–26 మధ్యకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మేక్ ఇన్ ఇండియాతోపాటు ఎక్స్‌పోర్ట్ ఇండియాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పెట్టుబడులు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం అసెంబ్లింగ్ యూనిట్‌లో లైన్ కెపాసిటీని పెంచుతున్నది. ప్రస్తుతం భారత్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న 400కేవీ/765కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను సంస్థ ఉత్పత్తి చేస్తున్నది.

ఇన్ఫోసిస్ లాభం 6,368 కోట్లు

బెంగళూరు, జూలై 18: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సంస్థ రూ.6,368 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.5,945 కోట్ల లాభంతో పోలిస్తే ఏడు శాతం వృద్ధిని కనబరచగా...వరుస త్రైమాసికాలతో పోలిస్తే మాత్రం 20 శాతం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 3–4 శాతం స్థాయిలో ఉండనున్నట్లు గైడెన్స్‌లో పేర్కొంది. గతంలో 1–3 శాతం మధ్యలో ఉంటుందని అంచనా వేసిన విషయం తెలిసిందే. సంస్థ ఆదాయం రూ.37,933 కోట్ల నుంచి రూ.39,315 కోట్లకు చేరుకున్నది.

20 వేల మంది ఫ్రెషర్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 15 వేల నుంచి 20 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. వ్యాపార వృద్ధిని బట్టి ఈ స్థాయిలో తీసుకోనున్నట్లు పేర్కొంది. మరోవైపు సంస్థలో ఉద్యోగుల సంఖ్య 6 శాతం తగ్గి 3,15,332లకు పడిపోయారు. ఏడాది క్రితం ఇది 3,36,294గా ఉన్నారు. మార్చి త్రైమాసికంలో ఉన్న 3,17,240 మందితో పోలిస్తే స్వల్పంగా తగ్గారు.

- ఉద్యోగుల వలసల రేటింగ్ 4.6 శాతం తగ్గి 12.7 శాతానికి పరిమితం.
- కంపెనీ ఆపరేటింగ్ మార్జిన్ 21.1 శాతంగా ఉన్నది. ఈ ఏడాది మొత్తానికి 20–22 శాతం మధ్యలో సంస్థ అంచనా వేస్తున్నది.
- గత త్రైమాసికంలో సంస్థ 4.1 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నది.
- సంస్థ ఆదాయంలో కీలక విభాగమైన ఆర్థిక సేవలు 0.3 శాతం తగ్గి 27.4 శాతానికి పరిమితమైంది.
- కంపెనీకి వచ్చిన ఆదాయంలో ఉత్తర అమెరికా వాటా 1.2 శాతానికి తగ్గగా, యూరప్ వాటా 9.1 శాతానికి ఎగబాకింది. అలాగే ఇండియా వాటా 19.9 శాతంగా ఉంది.
- కంపెనీ షేరు 1.93 శాతం లాభపడి రూ.1,759.15 వద్ద స్థిరపడింది.



ఈ ఆర్థిక సంవత్సరం లాభాలతో ఆరంభించాం. ఆపరేటింగ్ మార్జిన్లు అధికంగా ఉండటం, అతిపెద్ద ఒప్పందాలు కుదుర్చుకోవడం, వినూత్న సేవలు అందించడం వల్లనే ఇది సాధ్యమైంది. సంస్థపై క్లయింట్లు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నూతన టెక్నాలజీ సేవలు అందించడం లాభాల్లో వృద్ధికి దోహదపడింది. తొలి త్రైమాసికంలో పెద్ద ఒప్పందాలు కుదుర్చుకోవడంతో బలమైన పనితీరు కనబరిచగలిగాం. పూర్తి ఏడాది ఇదే తీరు కనబరుచాలనుకుంటున్నాం.

- సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ